క్లుప్తంగా

వైద్య సిబ్బందికి సన్మానం



వైద్య సిబ్బందిని సన్మానించిన గ్రామస్తులు

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్ద గోల్కొండలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో సేవలందించిన పెద్దషాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందిని బుధవారం సర్పంచ్ లక్ష్మయ్య సన్మానించారు. గ్రామంలో ఎనిమిది రోజులుగా 1360 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 297 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వరూప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్, వార్డు సభ్యులు శ్రావణి, సాయిలమ్మ, యదయ్య, వైద్య సిబ్బంది ఉస్మాన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగతంగా దూషించారని కౌన్సిలర్ ఫిర్యాదు

మణికొండ: వ్యక్తిగతంగా దూషించడంతో పాటు అంతు చూస్తానని బెదిరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని అలకాపూర్ టౌన్‌షిప్ 8వ వార్డు కౌన్సిలర్ నవీన్‌కుమార్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరారు. బుధవారం మహాత్మాగాంధీ పార్కులో కామదేను సంస్థ తరఫున ప్రజలకు మిల్లెట్స్ టిఫిన్ అందించేందుకు వారు ఓ వాహనాన్ని తీసుకురాగా తాను అడ్డుకున్నానని, దీంతో తనను దుర్భాషలాడారని నవీన్‌కుమార్ చెప్పారు.

బార్ ఏర్పాటుకు అనుమతివ్వొద్దు



ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ శ్వేతరవికాంత్‌రెడ్డి

మణికొండ: నివాసాల మధ్య బార్ ఏర్పాటుకు అనుమతించవద్దని కౌన్సిలర్ డిమాండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు లక్ష్మీనగర్ కాలనీలో కొత్తగా బార్ ఏర్పాటు చేస్తున్నారని, దానికి ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని కౌన్సిలర్ బి.శ్వేత రవికాంత్‌రెడ్డి కోరారు. బార్ ఏర్పాటు చేయాలనుకుంటున్న భవనానికి సమీపంలోనే పాఠశాల, హనుమాన్ దేవాలయం, మున్సిపల్ కార్యాలయం నిర్మాణంలో ఉందని, వీటిని దృష్టిలో ఉంచుకుని అనుమతులు ఇవ్వరాదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాధ్యతగా భావించి వైద్య సేవలు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ జావిద్

రాజేంద్రనగర్: వ్యాపార దోరణితో కాకుండా బాధ్యతగా భావించి వైద్య సేవలు అందిస్తున్నామని అత్తాపూర్‌లోని జర్మంటెన్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మీర్ జావిద్ జర్‌ఖాన్ వెల్లడించారు. అత్తాపూర్‌లోని జర్మంటెన్ ఆస్పత్రిలో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా చాంపియన్ ఆఫ్ చేంజ్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో సేవలు అందజేస్తున్న 17 మందికి ఈ అవార్డులు అందించారని, తెలంగాణ నుంచి తనకు అవార్డు దక్కిందన్నారు. అవార్డుతో తనకు మరింత బాధ్యత పెరిగిందని, అందుకు అనుగుణంగా వైద్య సేవలు అందిస్తానని ఆయన అన్నారు.

కిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

- మహిళకు పారా గాంగ్లియోమా కణితి తొలగింపు

గచ్చిబౌలి: జాంబియాకు చెందిన మహిళకు కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేశారు. పారా గాంగ్లియోమా కణితిని తొలగించినట్లు ఎండోక్రైన్ శస్త్ర చికిత్స నిపుణురాలు డాక్టర్ రమ్య వేలివేరు తెలిపారు. పది లక్షల మందిలో ఇద్దరు ఈ కణితితో బాధపడతారని, రక్తపోటు నియంత్రణలో లేకపోవడం .. తలనొప్పి, గుండె దడ, ఆందోళన తదితర సమస్యలు ఉండటంతో రోగ నిర్ధారణ పరీక్షలు ద్వారా ఉదర భాగంలో కణితి ఉన్నట్లు అక్కడి డాక్టర్లు గుర్తించారని, ఆ మహిళను జాంబియా ప్రభుత్వం కిమ్స్ ఆస్పత్రికి పంపించిందన్నారు. ఎండోక్రైనాలజీ విభాగం కన్సల్టెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి నేతృత్వంలో గుండె, మూత్ర పిండాలకు ఇబ్బంది కల్గకుండా కణితిని తొలగించామన్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండటంతో డిశ్చార్జ్ చేసినట్లు చెప్పారు.

అప్పుడే నీటి ఎద్దడి..!

- వేసవికాలం ప్రారంభ దశలోనే తాగునీటి ఇబ్బందులు
- బండ్లగూడ జాగీర్ పరిధిలో అడుగంటిన బోర్లు
- ట్యాంకర్ నీళ్లు కొనుక్కుంటున్న ప్రజలు
- మిషన్ భగీరథ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి



హైదర్షాకోట్‌లో అడుగంటిన ఎర్రకుంట



యాదవమిత్ర కాలనీలో ట్యాంకర్ నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

బండ్లగూడ: గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజు రోజుకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో వేసవిలో నీటి ఎద్దడి తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే బోర్లలో నీళ్లు ఇంకిపోవడంతో ట్యాంకర్ నీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే రెండు నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు అన్ని ప్రాంతాల్లో కుంటలు, చెరువులు అలుగు పారాయి. అయితే కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు, హైదర్షాకోట్‌లోని ఎర్రకుంటలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరడంలేదు. చెరువులు కబ్జాకు గురికావడమే దీనికి కారణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. చెరువుల్లోకి వచ్చే వరద నీటి కాలువలు సైతం ఆక్రమణకు గురికావడంతో ఎన్ని వానలు పడినా ఇవి నిండడం లేదు. కుంటల్లోకి చేరిన కొద్దిపాటి నీరు అడుగంటడంతో ఇళ్లలోని బోర్లు సైతం పనిచేయడం లేదు. చెరువుల్లో నీటి నిల్వ ఉంటే బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

నిర్మాణ దశలోనే మిషన్ భగీరథ ట్యాంకులు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకంలో భాగంగా కార్పొరేషన్ పరిధిలో రూ.50 కోట్ల నిధులతో 5 వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పైపులైన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. పనులు త్వరగా పూర్తి చేసి వేసవిలో నీటి ఎద్దడి లేకుండా జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

‘తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారు’



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వీటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆర్.ప్రదీప్‌కుమార్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్స్ పూర్తి చేసుకున్న సందర్భంగా రాజేంద్రనగర్ అసెంబ్లీ శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్స్ ముగింపు సభ శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీలో ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమని మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ప్రదీప్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైతే నిధులు, నీళ్లు, నియామకాలు వస్తాయని చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజలకు మొండి చేయి చూపించారన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని ఆయన అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ కార్నర్ మీటింగ్స్ ఇన్‌చార్జ్ కొమురయ్య, కో కన్వీనర్ మహాలింగంగౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంగీతగౌరీశంకర్, రాచూరి రాజశేఖర్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం



రాజు

శంషాబాద్ రూరల్: వివాహేతర సంబంధం ఓ మహిళ హత్యకు దారితీసింది. తనతో గడిపితే డబ్బులు ఇస్తానని మోసం చేసిన వ్యక్తి ఆమె మెడకు చీర బిగించి హత్య చేశాడు. వారం కిందట మల్కారం సమీపంలో జరిగిన మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రామంజాపూర్ గ్రామానికి చెందిన నార్ల పద్మమ్మ(45) భర్త గతంలో చనిపోయాడు. అదే గ్రామానికి చెందిన కత్తుల రాజు(35)తో ఉన్న పరిచయం వారిద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారితీసింది. ఆరు నెలల కిందట డబ్బులు ఇస్తానని ఆమెను లొంగదీసుకున్న ఇతను తర్వాత మాట మార్చడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి కొన్నాళ్లు మాట్లాడుకోలేదు. ఫిబ్రవరి 19న రాత్రి పద్మమ్మ అతడికి ఫోన్ చేసి డబ్బులు అడిగింది. బయటకు వస్తే ఇస్తానని చెప్పాడు. దీంతో రాత్రి ఏడున్నర గంటల సమయంలో పద్మమ్మను తన బైక్‌పై మల్కారం శివారుకు తీసుకెళ్లాడు. డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో పద్మమ్మను చీరతో మెడకు బిగించి హత్య చేశాడు. ఫిబ్రవరి 23న మల్కారం శివారులో పద్మమ్మ మృతదేహం లభించింది. మృతదేహం వద్ద దొరికిన సెల్ ఫోన్, సమీపంలోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనుమానంతో రాజును అదుపులోకి తీసుకుని విచారించగా పద్మమ్మను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు.

‘మనూ’ అభివృద్ధిలో యూజీసీ పాత్ర ప్రశంసనీయం



బాయ్స్ హాస్టల్‌ను ప్రారంభించిన వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: మనూ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం, యూజీసీ పాత్ర ప్రశంసనీయమని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో కొత్తగా నిర్మించిన బాయ్స్ హాస్టల్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాంపస్‌లోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని విద్యార్థి సంఘంకు సూచించారు. అనంతరం హాస్టల్ ప్రాంగణంలో వీసీ మొక్క నాటారు.

సౌకర్యాల పరిశీలన...

ఉర్దూ విశ్వవిద్యాలయంలో కల్పిస్తున్న సౌకర్యాలను వీసీ హసన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీస్ పరీక్షల అభ్యర్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇస్తియాక్ అహ్మద్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్, ప్రొఫెసర్లు ముస్తాక్ అహ్మద్ పటేల్, డాక్టర్ వికర్ ఉన్నిసా, డాక్టర్ జమాలుద్దీన్‌ఖాన్, సీపీడబ్ల్యూడీ అధికారులు అశోక్‌కుమార్, నాగేశ్వరరావు, తారీఖ్ అహ్మద్ మసూది, డాక్టర్ షేక్ వసీమ్ షేక్ షబ్బీర్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎండి ఫైజాన్ పాల్గొన్నారు.

విజేత నమో వెంకటేశాయ టీమ్



క్రీడాకారులతో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భిక్షపతియాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి లేగల గ్రౌండ్‌లో ఆర్.కే.వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజ్‌కుమార్‌యాదవ్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నమో వెంకటేశాయ టీమ్ నిలిచింది.బుధవారం నిర్వహించిన ముగింపు వేడుకలకు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్‌లు హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన అన్‌స్టాపబుల్ 11 టీమ్‌తో పాటు మ్యాన్ ఆఫ్ ద సిరీస్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్‌యాదవ్, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లేగల వెంకట్‌రెడ్డి, నాయకులు నాగులు గౌడ్, అనిల్ యాదవ్, రాఘవేంద్రరావు, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులు

జియాగూడ: క్విస్ట్ ట్యాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ శ్రేష్ట సమ్మాన్ అవార్డు 2023లో జియాగూడ కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు పోటీల్లో ప్రతిభ చాటారని జియాగూడ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాస్, అకాడమి ప్రిన్సిపల్ పి.శ్రీకాంత్‌లు అన్నారు. ఈ మేరకు బుధవారం కేటీ ఎస్ స్కూల్ ఆవరణలో ప్రతిభ చాటిన 7 మంది విద్యార్థులను అభినందించారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్విస్ట్ ట్యాలెంట్ ఒలంపియాడ్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారన్నారు.

నేటి నుంచి ‘నిథమ్’లో అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: పర్యాటక, అతిథ్య కేంద్రం గచ్చిబౌలిలోని ‘నిథమ్’లో మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు నిథమ్‌లోని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో జరిగే ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కేంద్ర పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సివి శంకర్‌రెడ్డి, టీఎస్‌టీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ బి మనోహర్, టీసీఈఐ అధ్యక్షులు బలరామ్‌బాబు, నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ చిన్నంరెడ్డితో పాటు పలువురు ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొంటారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు ‘మనూ’లో సెమినార్

రాయదుర్గం: మనూలో అరబిక్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఒకరోజు ప్రత్యేక సదస్సు జరుగుతుందని అరబిక్ విభాగం హెడ్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్ జైసీ తెలిపారు.‘భారతదేశంలో అరబిక్ భాష: సవాళ్లు, అవకాశాలు’ అనే అంశంపై ఉదయం 10 గంటలకు ఎస్ఎల్ఎల్ అండ్ ఐ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సదస్సు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్ జైసీ, డాక్టర్ జావెద్ నదీమ్ నద్వీ, డాక్టర్ మహ్మద్ షాకీర్ రజా పాల్గొంటారన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

గచ్చిబౌలి: మారబోయిన రాజ్‌కుమార్ వర్ధంతిని పురస్కరించుకొని శేరిలింగంపల్లి సర్కిల్ జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. బుధవారం మసీద్‌బండలో మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్ యాదవ్‌లు రాజ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కొండాపూర్ ఆస్పత్రిలో గర్భిణులకు పండ్ల పంపిణీ, విద్యార్థులకు అన్నదానం చేశారు.

సీపీఆర్‌పై అవగాహన

గచ్చిబౌలి: గుండెపోటుతో నేలకూలినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలో కొండాపూర్ టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఇటీవల గుండెపోటుకు గురైన వారికి వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాపాయం తప్పిన ఘటనలు చోటు చేసుకున్న క్రమంలో టీఎస్ఎస్‌పీ పోలీసులకు ఐబీటీపీ మొయినాబాద్, యూనిట్ మెడికల్ ఆఫీసర్ జ్యోతిరావు పులే అవగాహన కల్పించారు.

సైన్స్ ఫెయిర్స్‌తో కొత్త ఆవిష్కరణల వైపు..

గోల్కొండ: సైన్స్ ఫెయిర్లతో విద్యార్థుల్లోని ప్రతిభ బయటకు వస్తుందని, ఆలోచనాశక్తి మరింత చురుగ్గా మారుతుందని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హానా మొబిన్ అన్నారు. గుడిమల్కాపూర్ నారాయణ స్కూల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వారు తయారు చేసిన నమూనాలు, వాటి పనితీరు గురించి వివరిస్తున్న తీరు చాలా బాగుందన్నారు. మరింత ఉత్సాహంగా విద్యార్థులు కొత్త ఆవిష్కరణల వైపు ఆకర్షితులవుతారని అన్నారు. ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, రీజనల్ ఇన్‌చార్జి నవీన్, జోనల్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఫర్హానా, రష్మీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటానంటూ సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి

గచ్చిబౌలి: ఆత్మహత్య చేసుకుంటానంటూ కడ్తాల్‌కు చెందిన రాజుగౌడ్(39) బుధవారం ఖాజాగూడలో సెల్‌టవర్ ఎక్కాడు. దీంతో రాయదుర్గం పోలీసులు, మాదాపూర్ అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. తన భార్యా పిల్లలను రప్పించాలని లేకపోతే కిందకు దూకేస్తానని హెచ్చరించాడు. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అతనికి నచ్చజెప్పి కిందకు దింపారు. అనంతరం అతని స్వస్థలం కడ్తాల్‌కు పంపించివేశారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఇదిలావుండగా గతంలో కూడా పలుమార్లు ఇలాగే చేసినట్లు పోలీసులు గుర్తించారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న భూపాల్

మైలార్‌దేవ్‌పల్లి: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఎల్‌వో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కాటేదాన్ క్లస్టర్ పారిశ్రామిక ప్రాంతంలోని కాటేదాన్ చౌరస్తా నుంచి శంషాబాద్ ఏఎల్‌వో కార్యాలయం బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్మికుల పక్షాన సీఐటీయూ ముందుండి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదరి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, జిల్లా నాయకులు జి.కురుమయ్య, గట్టయ్య, ప్రవీణ్‌కుమార్, జె.పెంటయ్య, కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి పి.భాస్కర్, బాలస్వామి, రాహుల్, మహమూద్, సచిన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

రాజేంద్రనగర్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని డివిజన్ ఉద్యోగుల సంఘం 1104 యూనియన్ అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి అజీమ్ కోరారు. బుధవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఆర్‌సీ ప్రకటించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తుందన్నారు. విద్యుత్ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కష్టపడి పని చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ఉద్యోగులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో మరింత ఉధృతంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్లు ఈశ్వర్‌ప్రసాద్, శ్రీనివాస్, సత్యనారాయణ, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగమణి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు రవీందర్, వెంకటకృష్ణ, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి



బండ్లగూడ: మెడికో ప్రీతి ఆత్మహత్యకు కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని యాదాద్రి కాలనీ ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ యాదాద్రి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో కాలనీ వాసులు కొవ్వొత్తులతో కిస్మత్‌పూర్ చౌరస్తాలోని వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ర్యాగింగ్ భూతానికి ఎంతో మంది విద్యార్థులు బలవుతున్నా ప్రభుత్వంలో చలనం రాకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థుల్లో పరివర్తన రావడం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉన్నా అధికారులు, ప్రభుత్వం ఆ పని చేయకపోవడంతోనే చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి సైఫ్‌ను తక్షణమే శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అమర్నాథ్, రఘునందన్‌గౌడ్, మనోజ్, మధుకర్, సంజీవ్, ప్రసన్న, రజిని, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

సాత్విక్ కుటుంబానికి న్యాయం చేయాలి



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మణికొండ: శ్రీ చైతన్య విద్యా సంస్థలు ఆత్మహత్యలకు నిలయంగా మారుతున్నాయని, వాటి బారి నుంచి విద్యార్థులను కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్, కార్యదర్శి బి.శంకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా నాయకులు మణికంఠరెడ్డి, పి.లక్ష్మణ్ అన్నారు. నార్సింగిలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ విద్యార్థి సాత్విక్ ఆత్మహత్య చేసుకోడంతో బుధవారం కళాశాల ఎదుట వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజుల కోసం తల్లిదండ్రులను, ర్యాంకుల కోసం విద్యార్థులను పీడుస్తున్నారని మండిపడ్డారు. నెల రోజుల క్రితం పిర్జాదిగూడలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని, ఇప్పుడు మరోసారి నార్సింగిలో అలాంటి సంఘటన జరిగినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. సాత్విక్ కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాద జాగ్రత్తలపై అవగాహన

మైలార్‌దేవ్‌పల్లి: అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గణేష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘు వెల్లడించారు. జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ ఎన్ఓసీ, ఫైర్‌సేఫ్టీ, వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఆర్ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, డీఆర్ఎఫ్ సిబ్బంది నర్సింగ్, రంజిత్‌కుమార్, శ్రీకాంత్, పాషా, రమేష్



అవగాహన కల్పిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

‘బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం’



కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

మణికొండ: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలోను అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ క్వార్టర్స్, శివపురికాలనీలలో బుధవారం నిర్వహించిన ప్రజల గోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవటంతో పాటు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని తప్పించి పారదర్శకంగా పనిచేసే బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీరప్ప, వందన, శ్వేత, సిద్ధప్ప, లక్ష్మీరాములు, పి.శ్రీనివాస్, పి. సత్యనారాయణ, ఇందిర, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

హోటళ్లకు షోకాజ్ నోటీసులు

లంగర్‌హౌస్: ఆహార పదార్థాల్లో విషపూరిత రంగులు వాడితే కఠిన శిక్షలు తప్పవని ఆహార భద్రత అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. లంగర్‌హౌస్‌లోని పలు హోటళ్లలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా బాపూనగర్ బస్‌స్టాప్ వద్ద ఉన్న సురభి హోటల్, రేణుక రెస్టారెంట్లపై పలు ఫిర్యాదులు అందాయని అధికారి తెలిపారు. ఇందులో భాగంగా విషపూరిత రంగులు, కెమికల్ డబ్బాలు, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను సీజ్ చేశారు. హోటల్ లోపల కూడా పరిశుభ్రత పాటించడంలేదని సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఈ రెండు హోటళ్లకు షోకాజ్ నోటీసులు అందించామని, త్వరలో క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.